క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం పంపిణీ చేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు వైద్యం కోసం మంజూరైన రూ.5.12 లక్షల విలువైన చెక్కులు అందించి, అండగా ఉంటామని లబ్ధిదారులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్య ప్రకాశరావు, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

9న అప్రెంటీస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 9న ప్రైమ్ మినిస్టర్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ బుధవారం తెలిపారు. కాకినాడతో పాటు అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లాలకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణత, ఎన్‌టీసీ సరిఫికెట్ కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చని, ప్రముఖ పరిశ్రమలు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. వివరాలకు సెల్: 63038 75609ను సంప్రదించవచ్చన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

కరప: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఫ్రెంచ్ విద్యావేత్త, లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రపంచ అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. భవిత కేంద్రంలోని ప్రత్యేకావసరాలు కల చిన్నారులకు ఎంఈఓ బుల్లికృష్ణవేణి పండ్లు పంచారు.

6 నుంచి 8 వరకు పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలు

నాగమల్లితోట జంక్షన్: పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల మహిళా క్రీడాపోటీలు ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్ బుధవారం తెలిపారు. బాలురకు ఆంధ్రాపాలిటెక్నిక్ ఆవరణలో, బాలికలకు జీపీటీలో వసతి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీల్లో కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడామైదానం, జీపీటీలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్

కాకినాడ క్రైం: కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నాయక్ బుధవారం 15 మంది ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దని చెబుతూ, కళాశాల విద్యార్థులు, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలగనివ్వొద్దని సూచించారు. ప్రవర్తనపై ఫిర్యాదులందిన 15 మందిని బైండోవర్ చేసినట్టు సీఐ నాయక్ తెలిపారు.

నైపుణ్యాలు.. బోధన పద్ధతులపై ప్రోగ్రాం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో బుధవారం 21వ శతాబ్దపు నైపుణ్యాలు,-బోధన పద్ధతులు అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు హాజరై మాట్లాడుతూ కళాశాలల్లో అధ్యాపకుల బోధన పద్ధతులు అవలంబించడం లేదని, దీనిని అధిగమించేందుకు ఇటువంటి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలల అధ్యాపకుల్లో బోధన పద్ధతులు మెరుగు పర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని, రానున్న కాలంలో 40వేల మంది అధ్యాపకులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించి బోధన పద్ధతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు అధ్యాపకులకు ఇటువంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. అనంతరం వైస్ చైర్మన్ రామ్మోహనరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ సుబ్బారావు, ఇంక్యుబేషన్ డైరెక్టర్ వెంకటరెడ్డి, రిసోర్స్ పర్సన్ కామన్‌వెల్త్ ఎడ్యుకేషన్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా ప్రతినిధి ఎస్.దినకరరెడ్డి, డైరెక్టర్ రవీంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ ఆవరణలో జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మొక్కలు నాటారు. గత ఏడాది వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఐదు జిల్లాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో 75 ఏళ్ల వయస్సు కలిగిన మొక్కకు రూ.2500 ప్రతి ఏడాది పారితోషికంగా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. అనంతరం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ప్రభుత్వ పథకాల అమలుకు అర్హతే ప్రాతిపదిక

- పింఛన్లు తొలగిస్తున్నారంటూ దుష్ప్రచారం
- నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి అందిస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి కొత్తగా మంజూరైన 1178 పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పండగ వాతావరణంలో నిర్వహించారు. స్మార్ట్ సిటీ, జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సభల్లో నూతన లబ్ధిదారులకు పింఛన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అర్హులు ఎంత మంది ఉన్నా పథకాల అమలులో ముఖ్యమంత్రి వెనుకాడబోరన్నారు. గత ప్రభుత్వ పాలనలో కొత్తగా పింఛన్ రావాలంటే అప్పటికే ఉన్న లబ్ధిదారులు ఎవరైనా చనిపోతే అవకాశం వచ్చేదని, పైగా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లిస్తే గాని పింఛన్ అందుకోలేని దయనీయ పరిస్థితి ఉండేదన్నారు. జగన్ సీఎం అయ్యాక అటువంటి పరిస్థితికి పూర్తిగా చెక్ పెట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులకు నేరుగా ఇంటికే పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. ఓ వైపు పెద్ద ఎత్తున ప్రభుత్వ పథకాలను అందుకుంటున్న టీడీపీ నేతలు కూడా 'ఇదేం ఖర్మ' పేరుతో ప్రజల్లోకి వెళ్తున్న తీరు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో అవ్వ, తాతల నుంచి ఒంటరి, వితంతు మహిళలు, వివిధ వర్గాలకు జగనన్న పింఛన్ కానుక పథకం ఎంతో భరోసాగా నిలుస్తుందన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన మాట తప్పకుండా సీఎం అమలు చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు తొలగిస్తున్నారనే ఆరోపణ వాస్తవం కాదన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి ప్రసాద్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, కర్రి శైలజ, కంపర బాబి, రోకళ్ళ సత్యనారాయణ, చిట్నీడి మూర్తి తదితరులు హాజరయ్యారు.



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



చిన్నారికి వీల్ చైర్ అందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

వీల్ చైర్ అందించిన ద్వారంపూడి

కాకినాడ: గడపగడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన విజ్ఞప్తి మేరకు మానసిక దివ్యాంగురాలైన ఓ చిన్నారికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి బుధవారం స్థానిక జగన్నాథపురం ఎన్‌సీఎస్ కమ్యూనిటీహాలులో జరిగిన కార్యక్రమంలో వీల్ చైర్ అందించారు. ఇటీవల 16వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో కరుకు కీర్తన అనేక చిన్నారికి సంబంధించిన సమస్యను మాజీ కార్పొరేటర్ పేర్ల జోగారావు, బీసీసెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్ ద్వారా ఆమె తల్లిదండ్రులు ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు జైన్ సంఘం వీల్ చైర్‌ను సమకూర్చగా ఎమ్మెల్యే ద్వారంపూడి చిన్నారికి అందించారు.

నన్నయ్య పీజీ సెంటర్లో ముందే సంక్రాంతి



అచ్చంపేట జంక్షన్ నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లో సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తూ..

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లో బుధవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పీజీ విద్యార్థినీవిద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎద్దుల బండి, బొమ్మల కొలువు, నమూనా గడ్డి ఇల్లు, భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులతో సందడి చేశారు. విద్యార్థులు ర్యాంప్ వాక్, నృత్య ప్రదర్శనలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి మాట్లాడుతూ సంక్రాంతి దక్షణాది రాష్ట్రాల ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకొనే పెద్ద పండగ అని, రైతులు పంట చేతికి అందే తరుణంలో ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కరప: మండలం ఉప్పలంక సమీపంలో బుధవారం పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ కథనం ప్రకారం.. ఉప్పలంక వద్ద పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,900 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, కాకినాడ కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

బాలికలకు సాంకేతిక విద్య అవసరం

బోట్‌క్లబ్: స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు బుధవారం రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లు అందించారు. తమ క్లబ్ సభ్యుల సహకారంతో కంప్యూటర్ శిక్షణ తరగతులతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. హ్యాపీ స్కూల్స్ కమిటీ చైర్మన్ చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఐదేళ్లుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ చోడిశెట్టి పద్దరాజు, కార్యదర్శి వడ్డాది ఆదిత్య, సభ్యులు ముత్తా నవీన్, మైలవరపు సత్యనారాయణ, ధనసాగర్‌ప్రసాద్, భూపేంద్ర, సత్యపాల్, నేతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కంప్యూటర్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఆకట్టుకొన్న నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యకళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. లలితా నృత్యనికేతన్ నాట్యాచారిణి వి.లలితా నాయుడు విద్యార్థులు నృత్యరూపకాలు ప్రదర్శించారు. అనంతరం సంపత్ గణపతి కల్యాణ గానామృతం సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. నాట్యాచారిణి లలితా నాయుడుని సత్కళావాహని సభ్యులు సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న 15 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.



నృత్యరూపక ప్రదర్శనలో పాల్గొన్న లలితా నృత్యనికేతన్ విద్యార్థులు

కొంగోడులో వేంకటేశ్వరస్వామికి రథోత్సవం

కరప: మండలం కొంగోడులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి బుధవారం గ్రామస్తులు, భక్తులు భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ ఏడాది సప్త సప్తాహం(డిసెంబరునెల 15 నుంచి ఈనెల రెండో తేదీవరకు) వివిధ భజన బృందాలతో నిర్వహించారు. సప్త సప్తాహం ముగింపు సందర్భంగా బుధవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం జరిపారు. కొంగోడు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఉదయం ఆలయం వద్ద గోపూజ, అనంతరం పూర్ణాహుతి శాంతి హోమం, స్వామికి శాంతి కల్యాణం నిర్వహించి, అన్నసమారాధన జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.



కొంగోడులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి రథోత్సవం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఆవ్యక్తి ఈ నెల 3వ తేదీన కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ వంతెన కింద అపస్మారక స్థితిలో ఉండగా రైల్వే ఎస్‌ఐ రవికుమార్ సహా సిబ్బంది గమనించి ఆసుపత్రిలో చేర్చారు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి వివరాలు తెలిసిన వారు కాకినాడ రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. వివరాల కోసం సెల్: 94407 02328 కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ రవికుమార్ కోరారు.



యువత స్వయం ఉపాధికి మౌలిక సదుపాయాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రాష్ట్రంలో యువత స్వయం ఉపాధి పొందడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడలోని డీసీసీబీ బ్యాంకు ఆవరణలో రూ.రెండు కోట్లతో నిర్మించే గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ నూతన భవనానికి బుధవారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. కాకినాడ నగరంలో నిర్మిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ భవనం ఆర్థికంగా యువత ఉపాధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ భవనం కార్పొరేట్ సంస్థలకు దీటుగా నిర్మిస్తున్నామన్నారు. భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలని డీసీసీబీ చైర్మన్‌ను కోరారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ వీలైనంత త్వరగా భవనం నిర్మాణం పూర్తి చేసి యువతకు శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం డీసీసీబీ పాలక వర్గ సభ్యులు కన్నబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ పాలక వర్గ సభ్యులు, పోలిశెట్టి సోమరాజు, సయ్యద్ మొహీద్దీన్, పులి మధుసుధాకర్‌బాబు, బండారు సత్తిరాజు, పంతం శ్రీదుర్గాభవానీరామ్, డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, ఆప్కాబ్ నోడల్ అధికారి రాజీవ్‌బాబు, బ్యాంకు జీఎం ప్రవీణ్, డీజీఎం త్రినాథ్, ప్రకాష్ శ్రీధర్, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ, కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షుడు బెండా విష్ణు పాల్గొన్నారు.



నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

అథ్లెటిక్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వాసంశెట్టి మహావీర అజితేష్ కాకినాడలో నిర్వహించిన 80 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఫిబ్రవరిలో 10 నుంచి 12 వరకు జాతీయ స్థాయిలో అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్(ఎన్ఐడీజేఏఎం)లో పాల్గొనేందుకు జిల్లా తరఫున అజితేజ్ ఎంపికయ్యాడు. అతడి ఆర్థిక పరిస్థితి గురించి మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గ్రామానికి చెందిన మేడపాటి నాగవీర సుబ్బారెడ్డి(చంటి)కి తెలపగా, ఆయన స్పందించి అథ్లెటిక్స్ మీట్‌కు వెళ్లేందుకు దారి ఖర్చుల కోసం రూ.నాలుగు వేలు ఇచ్చారు. వీటిని దాత తండ్రి మేడపాటి నారాయణరెడ్డి బుధవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, మాజీసర్పంచ్ తాతీలు సమక్షంలో క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందించారు.

పేదల సంక్షేమం కోసమే నవరత్నాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- పండూరులో గడప గడపకూ..

కాకినాడ రూరల్: పేదల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని పండూరు గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అధికారులు, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికి పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్‌దీపాలు వంటి తదితర సమస్యలపై విజ్ఞాపనలు రాగా, వాటి పరిష్కారానికి ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని, 2023 జనవరి నుంచి పింఛన్ సొమ్ములు వృద్ధులు,వితంతువులకు రూ.2,750లు చొప్పున అందజేస్తున్నామన్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు, గృహనిర్మాణాలతో పాటు పలు పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, నాయకులు నందిపాటి పల్లయ్య, ధర్మారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్తిరాజు, బావిశెట్టి వెంకటేశ్వరరావు, గరగ పెదకాపు, చెల్లారావు, కర్రి శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



పండూరులో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

పెనుమర్తిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

కాకినాడ రూరల్: స్థానిక పెనుమర్తి సచివాలయం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్ సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలు పరిశీలించారు. 104, 108 వాహనాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తమ్మవరం అంగన్ వాడీ సెంటర్లో జరుగుతున్న చిన్నపిల్లల టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు.

లయన్స్ క్లబ్ జెమ్స్ కార్యక్రమాలు మరింత విస్తృతం



ఉమా మనోస వికాస కేంద్రానికి కుర్చీలు అందజేసిన లయన్స్ జెమ్స్ క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ ద్వారా సేవా కార్యక్రమాలు ఈ ఏడాది మరింత విస్తృతం చేస్తామని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ లింగమల్లు కృష్ణమూర్తి పేర్కొన్నారు. బాలాజీచెరువు లయన్స్ కార్యాలయంలో ఈ ఏడాది క్లబ్ ద్వారా చేపట్టే విద్య, వైద్య, సామాజిక సేవ కార్యక్రమాలపై చర్చించారు. ఈ ఏడాది తొలి సేవా కార్యక్రమంలో భాగంగా ఉమామనో వికాస కేంద్రానికి 100 కుర్చీలను లయన్ సభ్యులు కిరణ్ అందజేయగా, గ్రీన్‌ఫీల్డ్, మహర్షి సాంబమూర్తి పాఠశాలకు వంటపాత్రలు, ఆర్థిక సాయం చేయడంపై కిరణ్‌ను అభినందించారు.

వసతి గృహ భవన నిర్మాణానికి చేయూత

కాకినాడ సిటీ: రంగరాయ మెడికల్ కాలేజీకి ఎదురుగా ఉన్న ఆనంద నిలయం వసతి గృహ భవన ఆధునీకరణకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్ కింద) ప్యారీ షుగర్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు రూ.10 లక్షల చెక్కును కంపెనీ వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎం.బాలాజీ, మానవ వనరుల విభాగం హెచ్ ఎ.శ్రీనివాసరెడ్డి అందజేశారు.

ఆమోదించి.. ఆదేశించి..

- కాకినాడ రూరల్ మండల పరిషత్ మిగులు బడ్జెట్ ఆమోదం
- ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నబాబు
- శాఖల వారీగా ప్రజా సమస్యలపై సమీక్ష
- శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశం

కాకినాడ రూరల్: మండల ప్రజా పరిషత్ 2023-24 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, 2022-23 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను మండల పరిషత్ కార్యవర్గం ఆమోదించింది. రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అంచనా, సవరణ బడ్జెట్ వివరాలు సభ ముందు ఉంచారు. 2022-23లో మండల పరిషత్ ఆదాయం సవరణ రూ.2,15,70,000కు చూపించారు. 2023-24కు గాను అంచనా రూ.2.18,62500గా చూపారు. సభ్యుల ఆమోదం అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం శాఖల వారీగా గడపగడపకూ వచ్చిన ప్రధాన విజ్ఞప్తులకు సంబంధించి ముఖ్యమైన శాఖల అధికారులతో సమీక్షించారు. గడప గడపకూ వచ్చిన విజ్ఞప్తుల్లో కొన్ని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారని, కొన్ని వారం వ్యవస్థలోనే పరిష్కరిస్తున్నారని, అయితే వాటి వివరాలు టాబ్ చేసి సమర్పించాలన్నారు. గ్రామాల్లో ఎక్కువగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయని, ఇళ్ల మధ్య ఉన్న వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున వాటిని పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ ఆదినారాయణ తదితరులు ప్రజల గ్రీవెన్స్‌ను తక్షణం పరిష్కరిస్తున్నామని, పెండింగ్ లేకుండా చూస్తామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకంతో లింకప్ అయ్యేలా ఎవరూ చూస్తున్నారని ఎమ్మెల్యే కన్నబాబు కోరగా.. ఏపీఓ కొండలరావు ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. మొత్తం 1387 ఇళ్లకు నేమాం, తిమ్మాపురంలో ఎన్ఆర్ఈజీఎస్‌తో లింకప్ చేశామని రాష్ట్ర వ్యాప్తంగా 175 మందికి సమస్య వచ్చిందని, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం మండల విద్యపై మాట్లాడుతూ ఎక్కువగా మధ్యాహ్నం భోజనంపై ఫిర్యాదులు అందుతున్నాయని ఎంఈఓను వివరణ కోరారు. ఎంఈఓ గణేష్‌బాబు మాట్లాడుతూ మధ్యాహ్నం తయారు చేసే ఏజన్సీ నుంచి దూరం నుంచి రావడంతో వంటకాలు చల్లబడుతున్నాయని, గుడ్లను పాఠశాలల్లోనే బాయిల్ చేసే ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదులు లేకుండా చూస్తామన్నారు. తాగునీటికి సంబంధించి తూరంగి, పండూరు పీహెచ్‌సీలకు తాగు నీటి సదుపాయాన్ని వైద్యులు కోరారు. కాకినాడ రూరల్ నియోజవర్గంలో సుమారు రూ.38 కోట్లతో ఇంటించి కుళాయిలు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయని, పీహెచ్‌సీలతో పాటు ప్రభుత్వం కార్యాలయాలను కుళాయి నీటి సదుపాయాన్ని తక్షణం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారుతీరామ్‌ను కోరారు. నేమాం గ్రామం వద్ద నాలుగో నంబరు లేఅవుట్‌లో ఐదు వేల మందికి పట్టాలు ఇచ్చామని, అక్కడ కెనాల్‌పై నిర్మిస్తున్న వంతెన వెడల్పుగా ఉండాలని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నేమాం సర్పంచ్ తమ గ్రామ పరిధిలోని రెండు ప్రైవేట్ పరిశ్రమల మధ్య ప్రభుత్వ కెనాల్ ఉందని దాని ద్వారా మురుగు నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని కోరడంతో తహసీల్దార్ మురార్జీని సర్వే చేసి కాల్వను గుర్తించి మురుగు పోయే మార్గం చేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, పింఛన్లను తొలగిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నోటీసులు ఇచ్చిన వారిలో 99 శాతం మందిని అర్హులుగా గుర్తించి పింఛన్ అందించామని ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు. గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పందుల సంచారంపైనా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ బాలాజీ, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మురార్జీ, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సవరణ, అంచనా బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు